

# అసలు దోషి?

"రా అన్నయ్యా! దారితప్పి వచ్చినట్లున్నావు"

గుమ్మంలో అడుగు పెడుతున్న కపిలేశ్వరరావుని చూసి మంద హాసం చేస్తూ అన్నది అతని చెల్లెలు వకుళ.

"దారి తప్పలేదు. ఎప్పుడూ అదే పలకరింపా?"

నవ్వుతూ సమాధానం చెప్పాడు కపిలేశ్వరరావు చెల్లెలికి.

"నాలుగేళ్ళు దాటుతోంది నువ్వు వచ్చి. అవునా?" అన్నది వకుళ.

"అవును ఏం చెయ్యను మరి? శెలవు దొరకద్దూ? పోలీస్ డిపార్టు మెంటులో ఉద్యోగం అంటేమాటలా?"

"రిటైరై పోయ్యావటగా?"

"కిందటి నెల అయ్యాను. ఉత్తరం రాసాగా"

"అయితే ఓ నెల రోజులయినా ఉంటావుగా?" అడిగింది వకుళ సంతోషంగా.

"ఉంటానో ఉండనో ఇంకా నిర్ణయించుకోలేదు. అయినా ఇక వస్తూపోతూంటాగా"

కపిలేశ్వరరావు చేతిలోని సూట్‌కేస్ అందుకుని లోపలికి పరిగెత్తాడు వకుళ పెద్దకొడుకు ఆనందంగా.

"ఏం మామయ్యా? ఇక్కడ హత్యేమీ జరగలేదు. ఎందుకు వచ్చావు?" అన్నది వకుళ కూతురు గారాబంగా.

"అదేమిటే? మామయ్య హత్యలు జరిగే చోటికే వెళతాడా ఏమిటి? నీది మరీ చోద్యం" అన్నది వకుళ బుగ్గలు నొక్కుకుంటూ.

"మామయ్య నీకో పెళ్ళి సంబంధం తీసుకొచ్చాడు" నవ్వుతూ అన్నాడు కపిలేశ్వరరావు.

"ముందర నువ్వు పిల్లని వెతుక్కో మామయ్యా తర్వాత నా సంగతి చూద్దువుగాని" అన్నది చేతిలో పుస్తకాంతో కాలేజీకి వెళుతూ.

ఓ పదిహేనేళ్ళ కుర్రాడు—వకుళ రెండో కొడుకు పరుగెత్తుకొచ్చి కపిలేశ్వరరావు జేబులు వెదికాడు గబగబా.

"ఏమిటి?" అడిగాడు కపిలేశ్వరరావు.

"పిస్తోలు"

"తీసుకురాలేదు. రిటైరయ్యానుగా"

"నీ స్వంత పిస్తోలు?"

"సూట్ కేస్‌లో ఉంది దేనికి?"

"వూరికెనే"

"బావేరీ?" అడిగాడు కపిలేశ్వరరావు చుట్టూ చుస్తూ.

"నీకు తెలుసుగా" అన్నది కొంచెం విసుగ్గా.

"ఇంకా మానలేదా?"

"చచ్చిపోయేముందు మీ ఆఖరు కోరిక ఏమిటని అడిగితే ఓసారి అడ్డాట ఆడాలనుంది అనేరకం. ఇక ఈ జన్మలో మానరు అది"

"డబ్బు ఏమైన వస్తుందా?"

"రావటంకూడానా? పోవడమే అంతా. ఎంత డబ్బు తగలెట్టాను ఆ పేకాటకి? ఎంతడబ్బు తలవంచుకుంటేనే బాధ వేస్తోంది."

నువ్వివ్వకపోతే ఆయనకిమాత్రం ఎక్కడినుంచి వస్తుంది?"

"ఇవ్వకపోతే ప్రాణం తీయరూ ఇచ్చేదాకా"

"పెద్దాడు ఎలా చదువుతున్నాడు?"

"కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఏం చెప్పనూ"

"స్నానం చేసి భోజనం చేయాలి ముందు. తర్వాత తీరిగ్గా చెప్దువు గాని"

"అలాగే నీతో చాలా చెప్పాలి"

అన్నయ్యకి అన్ని ఏర్పాట్లు చేయడానికి లోపలికి వెళ్ళిపోయింది వకుళ.

కపిలేశ్వరరావు గోడమీద వేలాడుతున్న ఫోటో ఫ్రేం దగ్గరకి వెళ్ళి నిలబడి చూడసాగాడు. చిన్నప్పుడు తను, చెల్లెలు, తల్లిదండ్రులతో కలిసి తీయించుకున్న చిత్రం.

కపిలేశ్వరరావుకి దాదాపు అరవై ఏళ్ళు. మొదటినుంచీ పోలీస్ డిపార్టుమెంట్‌లోనే పనిచేశాడు. స్వశక్తితో పైకివచ్చి కమీషనర్ పదవిలో రిటైర్ అయ్యాడు. ఆయన శక్తిమీద నమ్మకం కలిగి రిటైరింగ్ పీరియడ్ కూడా పెంచారు రెండుసార్లు. సమర్థుడవటంవల్ల. బ్రహ్మచారి పెళ్ళి చేసుకోలేదు. అన్ని దుర్ వ్యసనాలున్నా బయటకి నిండుకుండ.

అన్నం వడ్డిస్తూ చెప్పింది వకుళ.

పిల్లలని అలా గాలికి వదిలి ఆయన ఏమీ పట్టించుకోవటంలేదు. పెద్దాడుకూడా పూర్తిగా పాడయిపోయాడు ఈమధ్య. తాగుతున్నాడని తెలిసింది. చివాట్లు పెట్టినా తాగుడు మానటంలేదు.

దాని సంగతి చెప్పక్కర్లేదు. షోకులు, షికార్లు మొగ స్నేహితులతో సినిమాలకి వెళ్ళవద్దని చెపితే వినదు అసలు చెడిపోయిందనే నా అనుమానం. దాన్నెవడు పెళ్ళి చేసుకోడు. కాలేజీ మానమంటే మానదు.

ఆఖరి వాడిసంగతి చెప్పనే చెప్పక్కరలేదు. వీళ్ళందరికీ వున్న చెడ్డ అలవాట్లే కాకుండా వీడికి గంజాయి కూడా తాగే అలవాటుంది. పూరి

చివర భద్రకాళి గుడిలోని పూజారి అమ్ముతాడట గంజాయి. ఎలా అలవాటయిందో అయింది మొత్తానికి.

ఆయనకి పేకాట తప్ప మరో వ్యాపకం అవసరంలేదు. ఆ ఏభై రెండు ముక్కలూ తప్ప ఆయనకి జీవితంలో మరేమీ అవసరంలేదు.

నేనా కూర్చుంటే లేవలేను. లేస్తే కూర్చోలేను, ఈ సంసారం సంగతి నాకొక్కదానికే పట్టింది."

మౌనంగా వింటూండిపోయాడు కపిలేశ్వరరావు. ఆలోచిస్తూ మధ్య మధ్యలో మాత్రం చాలు.... నెయ్యి .. అన్నం....వద్దు" లాంటి మాటలు ఉపయోగించాడు.

అన్నం తిన్న తర్వాత అడిగాడు.

"మరి వీళ్ళందరికీ డబ్బు ఎందుకు ఇస్తావు? ఇవ్వటం మానేయ రాదు?"

"వూరుకుంటారా ఇవ్వకపోతే బేంక్‌లోంచి డబ్బు తీసుకొస్తుంటారు అయిపోయినప్పుడల్లా చెక్కు మీద సంతకం పెడతాను కళ్ళుమూసుకుని.

కపిలేశ్వరరావు మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయాడు.

"వీళ్ళ సంగతి నువ్వే చూడాలి. ఏదో ఏర్పాటుచేసి వెళ్ళు వెళ్ళే లోపల."

"అలాగే."

రాత్రి కపిలేశ్వరరావు తన గదిలో పడుకుని సిగరెట్ తాగుతుంటే వకుళ కూతురు వచ్చింది పాలగ్లాసుతో.

పాలగ్లాసు బల్లమీద పెట్టి ఇంకా అలాగే నిలబడివున్న వకుళ కూతురుని చూసి అన్నాడు కపిలేశ్వరరావు.

"అమ్మ నీ గురించి చెప్పింది."

"ఏమని?" అడిగింది.

కథా నిలయం
1069
శ్రీకాకుళం

"నీ తిరుగుళ్ళ గురించి."

"ఇంకా?"

"ఇంకా అప్రస్తుతం. త్వరగా నచ్చినవాడిని చూసి పెళ్ళి చేసుకోవటం ఉత్తమం. అనుభవంమీద చెపుతున్నాను."

"పెళ్ళి చేసుకుంటానంటే అమ్మ వద్దంటోందిగా."

"వాడ్నితప్ప మరెవ్వడినయినా చేసుకో నువ్వు కోరుకున్నవాడు అమ్మకి నచ్చలేదు.

"నాకు నచ్చాడు"

"నీ ఇష్టం"

వకుళ కూతురు వెళ్ళిన పావుగంట తర్వాత వకుళ పెద్దకొడుకు వచ్చాడు. అతని మొహంచూసే గ్రహించాడు ఏదోచెప్పాలనే ఉద్దేశంతో వచ్చాడని.

"ఏమిటి?" అడిగాడు.

"అమ్మకి నువ్వయినా నచ్చచెప్పు. నన్ను అసలు నమ్మదు. అడుగుతే డబ్బు ఇవ్వదు. చెడు తిరుగుళ్ళు పూర్తిగా మానేశాను ఇప్పుడు.

"ఒకళ్ళు నచ్చచెపితేకాదు. నువ్వే మీఅమ్మకి నిజం తెలిసేలా ప్రవర్తించాలి. అంటే నీ తాగుడు మానేయాలి."

"నువ్వేం సహాయం చేయలేవా?"

"చేయలేను."

"సరే అయితే"

కోపంగా గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

"ఏమిటి కోపంగా వెళుతున్నాడు?" అడిగాడు వకుళ భర్త చేతిలో పేక ముక్కలు కలుపుతూ లోపలికి వచ్చి.

"ఏంలేదు" అన్నాడు కపిలేశ్వరరావు.

"అడతావా బావా? ఏమీ తోచటంలేదు. పార్టనర్స్ కూడా ఇవాళ ఎవరూ లేరు."

"రా ఆడదాం కాని డబ్బుతో కాదు" అన్నాడు కపిలేశ్వరరావు నవ్వి.

"పందెం కాయకపోతే ముక్కలు పంచబుద్ధికాదు నాకు. పది పైసలు కౌంట్ తేలికలో పోతుంది."

పేక ముక్కలు పంచుతూ అన్నాడు.

"మీ చెల్లెలికి ఈమధ్య చాదస్తం మరీ ఎక్కువయిపోయింది. దాంతోపాటు డబ్బుపిచ్చి కూడా దాని చాదస్తాన్ని అణకొట్టాలి. చూస్తాను చూస్తాను. ఏదో రోజు...."

పంచటం ఆపి తన ముక్కలు అందుకున్నాడు నేలమీదనుంచి.

"చేన్నాడేడి? కనబడలేదు?" అడిగాడు కపిలేశ్వరరావు సెట్స్ సర్దుకుంటూ.

"ఇంట్లోలేడు. వాడు నన్ను మించినవాడు, ఏమయినా మనసులో పడితే చేసేదాకా నిద్ర పట్టదు. చెడ్డగా నయినా వృద్ధిలోకి వచ్చే లక్షణాలు కనబడుతున్నాయి"

వకుళని రేపు మద్రాసు తీసుకు వెళుతున్నాను" అన్నాడు కపిలేశ్వరరావు.

"దేనికీ?" అడిగాడు వకుళ భర్త పేకముక్కలవంక చూస్తూ.

"బ్లడ్‌ప్లషర్ ఎక్కువయింది. డాక్టర్ ఒకడున్నాడు నాకు తెలిసిన వాడు. ఓ వారం రోజులు మీ అందరినుంచి దూరంగా విశ్రాంతిగా ఉంటే దానికీ, మీకూ కూడా హాయి ఏమంటావు"

"నాకేం అభ్యంతరంలేదు. కాని వెళ్ళేముందు ఓ వెయ్యి...." నసిగాడు.

"దేనికీ?"

"ఇంటి ఖర్చులకి."

"వారం రోజులకి వెయ్యా వంద గడపయినా లేని ఈ పల్లెటూర్లో

పట్నం ఆరు మైళ్ళేగా? పట్నానికి వెళ్ళి వచ్చేందుకు కారుఉంది పెట్రోలు టేంక్ నిండా పోయిస్తాను."

"గిట్టదు" అన్నాడు నవ్వుతూ.

* * *

"పదిరోజుల్లో తిరిగి వచ్చేశాడు కపిలేశ్వరరావు చెల్లెలు వకుళతో. వకుళ తిరిగి వచ్చిన తర్వాత వకుళలో మార్పు గమనించారు అందరూ. ఇదివరకులాగా అందరిమీదా సణగటంలేదు.

మార్పువల్ల చాదస్తం కొద్దిగా తగ్గిందనుకున్నారు అంతా.

ఆ రోజు పెద్ద దెబ్బలాటయింది. డబ్బు అడిగాడు వకుళ పెద్ద కొడుకు. ఇవ్వలేదు వకుళ. పెద్ద కొడుకుని సపోర్టు చేసాడు వకుళ భర్త. ఆయనకి కూడా డబ్బు అవసరం ఉంది కాబట్టి.ఛస్తే చిల్లిగవ్వ కూడాఇవ్వనంది ఎవరికీ.

ఆ రాత్రి ఎవరూ భోజనం చేయలేదు. వకుళమీద కోపంతోనే అందరి కడుపులూ నిండిపోయాయి.

అర్ధరాత్రి రెండుగంటల ప్రాంతంలో కపిలేశ్వరరావుని గట్టిగా తట్టి లేపితే మెలకువ వచ్చింది. లేచి కూర్చుని చేతి గడియారంవంక చూసుకున్నాడు.

"ఏమిటి?" అడిగాడు ఆవలిస్తూ. చుట్టూ చేరిన వకుళ భర్తని, పిల్లలని చూసి.

"అమ్మ...."అన్నాడు చిన్నాడు ఖంగారుగా.

"ఏమయింది అమ్మకి? బ్లడ్ ప్రెషర్ పెరిగిందా? ఇందుకే అనవసరంగా దాన్ని రెచ్చగొట్టదన్నాను" అన్నాడు కపిలేశ్వరరావు అందరి మొహాల్లోని ఖంగారుని గమనించి.

"బ్లడ్ ప్రెషర్ కాదు. బ్లడ్ బ్లీడింగ్"

"దెబ్బ తగిలిందా?"

"పిస్తోలు" అన్నాడు వకుళ భర్త.

"డామిట్ ఏమిటి సంగతి స్పష్టంగా చెప్పండి"

"పిస్తోలుతో కాల్చారు"

పక్కమీదనుంచి ఉరికి నైట్ గౌన్ బెల్టు బిగించుకుంటూ అన్నాడు.

"ఎవరు కాల్చారు?"

"ఏమో."

"పిస్తోలుతో కాల్చినట్లు మీకెలా తెలుసు?"

"పక్కనే పడివుంది"

"బ్రతికివుందా?" అడిగాడు అనుమానంగా.

"లేదు"

తల వంచుకుని సమాధానం చెప్పింది వకుళ కూతురు.

"ఎక్కడిది పిస్తోలు?"

తన సూట్ కేస్ దగ్గరకి గబగబా వెళ్ళి తెరచి చూశాడు బట్టలన్నీ తీసి విదిలించి కింద కుప్పగా పడేసి, సూట్ కేస్ బోర్లించాడు కింద.

వెనక్కి తిరిగి దూరంగా నిలబడి ఉన్న వాళ్ళవంక చూసి హాలు లోనికి నడిచాడు కపిలేశ్వరరావు.

దూరంనుంచే చూశాడు కుర్చీలో కూర్చునివున్న వకుళని. కళ్ళు మూసుకుని ఉన్నాయి. ఛాతీనుంచి రక్తంకారి చీరంతా తడిసిపోయింది. తల వెనక్కి వాల్చి, చేతులు నేలమీదకి వేలాడేసింది వకుళ.

పిస్తోలు నేలమీద పడివుంది. కపిలేశ్వరరావు పిస్తోలు దగ్గరికి నడిచివెళ్ళి, చేతిరుమాలుతో, వేలిముద్రలు చెడిపోకుండా అందుకుని పిస్తోలు వాసన చూసి అన్నాడు గంభీరంగా.

"ఇది నా పిస్తోలు. దీనిమీద వేలిముద్రలు దొరుకుతాయి"

ఎవరూ మాట్లాడలేదు.

వకుళ దగ్గరికి వెళ్ళి చెయ్యి అందుకుని నాడి పరీక్షించాడు. "అంతా అయిపోయింది" అన్నాడు నిస్పృహగా.

కపిలేశ్వరరావు దృష్టి వకుళ కూర్చున్న కుర్చీ వెనక వడ్డది. చటు క్కున వంగి అక్కడనుంచీ ఏవో తీసుకుని జేబులో వేసుకున్నాడు.

వకుళ భర్త పిల్లలవంక చూస్తూ అన్నాడు తీవ్రంగా.

"నా పిస్తోలు దొంగతనం చేసి మీలో ఒకరు చంపారు వకుళని. ఎందుకు? డబ్బుకోసం అయివుండవచ్చు. కోపం తీర్చుకోవడానికయివుండ వచ్చు. వకుళని పొట్టన పెట్టుకున్నారు. హత్య చేసారు" అనిఆగి, అందరి మొహాలవంకా పరిశీలనగా చూసిఅన్నాడు.

"నాకు తెలుసు మీలో ఎవరు చంపారో" ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు నలుగురూ.

"భయపడకండి చెప్పను ఎవరు చంపారో. కాని నాకు తెలుసు ఎవరు హంతకులో. వకుళ కూర్చున్న కుర్చీ వెనక నాకు అభేద్యమైన రుజువు దొరికింది."

ఒకరి మొహాల్లోకి ఒకరు అనుమానంగా చూసుకున్నారు ఆ నలు గురూ.

"పోలీస్‌లకి తెలియపరచాలి మనం. హత్య జరగగానే చట్టం ప్రకారం నేను రుజువును పోలీస్‌లకిఅందచేయాలి. నేనురిటైరవ్వకుండా ఉంటే డ్యూటీకి వ్యతిరేకంగా ప్రవర్తించకుండా అరెస్టుచేసిఉండేవాడ్నేమో చంపినవాళ్ళని. కాని ఇప్పుడు నేను రిటైరయిపోయాను. డ్యూటీతో, చట్టంతో అట్టే సంబంధంలేదు. కాబట్టి ఈ సంగతి మన ఐదుగురిమధ్యే అంతం అయిపోవాలి. ఎందుకంటే మీలోవున్న ఆ హంతకుడో, హంతకు రాలో నాకు ఇష్టమైనవాళ్ళే. ఏమంటారు?" అడిగాడు.

తలలూపారు అంతా.

"కాబట్టి వకుళది సహజ మరణంగా మనమంతా భావించాలి. అందరూ అలాగే భావించేలా ప్రవర్తించాలి. హత్య చేయబడ్డదనే అను మానం ఎవరికీ కలగనివ్వకూడదు సరేనా?"

"సరే" నలుగురూ ముక్తకంఠంతో అన్నారు.

"ఏర్పాట్లు చేయండి అయితే. రక్తం కడిగేసేయండి. గుండెల దాకా తెల్లటి దుప్పటి చివరిదాకా కప్పి ఉంచండి. ఆ గాయం ఎవరికంటా పడకుండా."

పిస్తోలు చప్పుడు విని వచ్చాను. అప్పటికే అంతా అయిపో యింది మిగతా ఎవరికీ మెలకువ రాలేదు. నేనే లేపాను"

వకుళ భర్త అన్నాడు ఏడుపు స్వరంతో.

"జరిగింది మర్చిపోవటానికి ప్రయత్నించండి మీరంతా దోషి మీలో ఒకరని మీకు తెలుసుగాని మిగతా ముగ్గురిలో అసలు దోషి ఎవరో తెలియదు. అసలు దోషికి తప్ప" అని ఆగి మళ్ళీ అన్నాడు.

"అసలు దోషి నాకు తెలుసు. అనవసరం కాబట్టి మీకు చెప్పను."

వకుళ మరణం సహజమరణంగా భావించారు. అలా భావించేలా ప్రవర్తించారు అంతా. అకస్మాత్తుగా బ్లడ్ ప్రెషర్ ఎక్కువయి మరణిం చింది. రిటైర్డు పోలీస్ కమీషనరే దగ్గరుండటంతో కరణం డెత్ సర్టిఫికెట్ మీద సంతకం పెట్టారు, ఆ కుటుంబానికి ఆప్తుడు కాబట్టి వకుళ హత్య చేయబడ్డదనే అనుమానం అసలురాలేదు, వచ్చినా అడిగేవాడు కాదేమో కూడా.

వకుళ శవం పూర్తిగా కాలిపోయేదాకా నిలబడి చూసి వెనుతిరిగారు అందరూ, కళ్ళలోంచి నీళ్ళు కారుతుండగా.

* * *

"గుర్తున్నాననుకుంటాను" అన్నాడు కపిలేశ్వరరావు నవ్వుతూ.

"ఓ గుర్తున్నారు. నెలక్రితం వచ్చారనుకుంటాను మీ చెల్లెలితో" అన్నాడు లాయర్.

"అవును. మీరు ఆ చెడ్డవార్త వినే ఉంటారు."

"విన్నాను. మీ బావగారు రాసారు. విన్ననే తెలిసిందే. మై కండో లెన్సెస్ టుయు"

"నెవర్ మైండ్ ఆఫ్ ఇట్. వకుళ రాసిన వీలునామా...."

"అమలు జరిపించాలా?"

"అవును బ్లడ్ ప్రెషర్ ఎక్కువయి చచ్చిపోయే ముందు అన్నది "ఒరేయ్! వీళ్ళ సంగతి నీకే వదిలేస్తున్నాను. ముక్కుకి తాడు వేసైనా దారికి తీసుకురా అని. ఈ ముసలితనంలో వాళ్ళ బాధ్యత కూడా నా నెత్తి మీదే పడింది" అన్నాడు కపిలేశ్వరరావు భారంగా.

"అయితే అన్ని ఏర్పాట్లు చేయిస్తాను. వకుళ మరణం తర్వాత, ఆమెకి చెందిన అన్ని ఆస్తులు, అన్ని హక్కులతో మీకే చెందేలా రాసి, ఒప్పుకుని సంతకం పెట్టింది. ఆ వీలునామా రిజిష్టర్ అయింది కాబట్టి మీరే ఇప్పుడు లీగల్ హైర్."

"థాంక్స్. వీలయినంత త్వరగా అయేలా చూడండి."

షేక్‌హాండ్ ఇచ్చి బయటకి వచ్చాడు కపిలేశ్వరరావు. మద్రాసులోని సుందరమైన మౌంట్‌రోడ్‌మీద నడుస్తూంటే ఆ రోజు ఓ ఖైదీ తనకి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఒకే ఒక్క తుపాకి గుండుతో జీవితాన్ని సుఖమయం చేసుకునే అవకాశం వస్తే, జారవిడుచుకోకూడదు."

తను చిన్నగా నివ్వుకున్నాడు.

అసలు దోసి ఎవరో, వకుళని హత్యచేసింది ఎవరో ఆ నలుగురిలో ఎవరికీ, ఎప్పటికీ తెలియదు.

(అపరాధ పరిశోధన జూన్ 1972)